108

# దేవరహస్యం

పోలీస్ ఆఫీసర్ పరంధామం తెలతెల్లవారకముందే లేచి ఆసనాలు వేశాడు. బస్కీలు తీశాడు. వేడి వేడి నీళ్ళు స్నానం చేసి గంట సేపు వేంకటేశ్వరస్వామి పటం ముందు ఒంటికాలుమీద జపం చేసి, నామాలు ధరించి పోలీస్ వేషం వేసుకున్నాడు.

పరంధామం గారి సతీమణి అప్పటికింకా నిద్రలేచి వుండదు. పిల్లలు డిటెక్టివో, సెక్సు నవలో చదూకుని అప్పుడే పడుకుని వుంటారు. వారి ప్రియురాలుమాత్రం ఆపాటికి అన్నీ ముగించుకుని తులసి కోట చుట్టూ తొలి చుట్టు తిరిగేసి వుంటుందని ఆయన అంతరాత్మ తొందర పెట్టింది.

పరంధామం గారు జీపు ఎక్కి కూర్చోగానే అది రాజఠీవితో కదిలి ప్రియురాలి ఇంటి వైపు బయల్దేరింది. ఆ యింటికి తిరిగే మలుపులోనే ఆంజనేయ స్వామి ఆలయం వుంది. మున్సిపాలిటీ బండిలాగ అక్కడ ఆగిపోయింది జీప్.

పరంధామం జీపు దిగి గుడి ముందుకు వచ్చి కాలిబూట్లు విప్పి, మేజోళ్ళు తీసి ముమ్మారు గుడి చుట్టూ ప్రదక్షిణం చేసి గుడిలోకి వచ్చి గంట ముమ్మారు మోగించి దేవుడి వైపు చూసి, మళ్ళీకళ్ళు మూసుకుని దణ్ణం పెట్టుకుని, పూరేకులు చెవిలో పెట్టుకుని, కళ్ళ జోడు తీసి కుంకుమ అద్దుకుని మళ్ళీ కళ్ళజోడు పెట్టుకుని మళ్ళీ ఓసారి దేవుణ్ణి తేరిపార చూసి చెంపలు వాయించుకుని జీప్ ఎక్కేడు. గుళ్లో కోరుకున్న వరాల్నే మరోసారి మననం చేసుకునేలోపునే జీపు ప్రియురాలు పారిజాతం యింటి ముందు ఆగింది.

జీప్ ఆగిన చప్పుడు వినగానే పారిజాతం హడావుడిగా హారతి పట్టుకుని అతనికి ఎదురొచ్చింది. పరంధామంగారు హారతి కళ్లకి అద్దుకుని ప్రసాదం తీసుకుని రెండు కళ్లకూ స్పృశించి నోట్లోవేసుకున్నాడు. కళ్ళ జోడు తీసి మళ్ళీ ఆవిడ బొట్టు పెట్టింది.

"ఈసారికూడా మీకు విజయం తప్పకుండా కలుగుతుంది- ఆ గజదొంగ

దొరికిపోతాడు. మీకు మళ్లీ పోలీస్ మెడలు, ప్రమోషనూ..'' సరసుడు ఏం చేశాడో ఏమో ఆ పైన మరి మాట్లాళ్లేకపోయింది పారిజాతం. ఆ తర్వాత అతని చెవిలోని పూరేకులు తీసుకుని కళ్ళ కద్దుకుని తడియారని కురుల్లో తురుంకుంది.

"వెళ్లనా మరి'' అన్నాడు ముద్దుగా.

"క్షేమంగా వెళ్లి లాభంగా రండి''- అని సాగనంపింది, పారిజాతం.

* * *

దేశంలో పేరుపొందిన ఒక గజదొంగ ఆ పరిసర అడవుల్లో తిరుగుతున్నాడని పోలీస్ కేంద్రానికి వార్తలొచ్చేయి. అందుకు దృష్టాంతరంగా రెండు మూడు దోపిడీలు కూడా జరిగేయి. దాంతో ప్రభుత్వంనుంచి ఘాటైన తాఖీదులు వచ్చేయి. అలాంటి కేసుల్ని అతి సాహసంగా నిర్వహిస్తాడని పేరుపొంది పోలీస్ మెడల్ కూడా ఆర్జింఁసుకున్న పరంధామంకు ఆ కేసును అప్పగించేరు.

* * *

మూడు జీప్‌లు అడివి దారి పట్టేయి. ముందు వెనుకా సాయుధ పోలీసు బలగం ఆజ్ఞయే తరువాయి అన్నట్లు సిద్ధంగా వుంది. పరంధామం మధ్య జీప్‌లో సుఖాసీనుడై వున్నాడు. కాకీ టోపీ నీడలో తెల్లటి నామాలకి కింద ఎర్రటి కళ్ళు రెండూ దీక్షగా పరిసరాలని పరిశీలిస్తున్నాయి. జీప్‌లు అడవి మధ్యకు వెళ్లేక కొండ నుంచి రెండు తుపాకి కాల్పులు విన్పించేయి. వెంటనే పోలీసుల ఎదురు కాల్పులు గాల్లో దూసుకు పోయాయి.

తర్వాత మౌనం.

జీప్‌లు ఫారెస్ట్ రెస్ట్ హౌస్‌కు వెళ్ళి పోయేయి.

రెస్ట్ హౌస్‌లో మూడు రోజులు మకాం వేసినా దొంగల జాడ పసిగట్టలేక పోయాడు పరంధామం. కాని ఓ మహత్తర విషయాన్ని మాత్రం తెల్సుకున్నాడు. అక్కడ, ఆ కీకారణ్యంలో, క్రూర మృగాలమధ్య ఓ స్వామిజీ తపస్సు చేసుకుంటున్నాడట. ఎన్ని రోజుల్నుంచో అలా దీర్ఘ సమాధిలోనే వున్నాడుట!! ఈ రోజే కళ్ళు తెరుస్తాడని శిష్యులు చెప్పారుట. ఈ వార్త తన వేగులు మోసుకు రాగానే హుటాహుటిన బయల్దేరేడు పరమ భాగవతోత్తముడు పరంధామం. ఆ వార్త అబద్ధం కాదు. ఓ పెద్ద మారేడు చెట్టు కింద యోగ ముద్రలో వున్న ఓ ఆజానుబాహువుని చూసి తన భక్తి ప్రవృత్తిని నిగ్రహించుకోలేక సాష్టాంగ ప్రమాణం చేయబోయాడు. కాని శిష్యులు

వారించేరు.

"ఇప్పుడు కాదు, మరికొన్ని క్షణాల్లో కళ్లు తెరుస్తారు అప్పుడు" అన్నారు.

ఆ కొద్ది క్షణాలూ కొన్ని యుగాలుగా గడిచేయి పరంధామంకు. స్వాముల వారు ఎలాగైతే కళ్లు తెరిచేరు. తెరవడమే తడవుగా ఆయన ముందు సాగిలపడిపోయాడు పరంధామం.

ఆయన్ని స్వహస్తాలతోనే లేపేరు స్వామీజీ.

"ధన్యుణ్ని స్వామీ" అన్నాడు పరంధామం.

"నీవో బృహత్తర కార్యంమీద ఒచ్చావు నాయనా, అది సఫలమౌతుంది. ఇదిగో..." అని చేయి పైకెత్తి "ఓం" అని గుప్పిలి విప్పారు. చేతిలోకి ఓ ఆపిలు వచ్చింది.

"ఇదే నీకు నా ఆశీర్వాదం తీసుకో నాయనా" అని చేతి కిచ్చేరు.

మహా ప్రసాదంగా స్వీకరించేడు పరంధామం.

పరంధామంకు మెరుపులా ఓ ఆలోచన తట్టింది. తట్టడమే తడవుగా

"స్వామీ..." అని పలకరించేడు.

"ఏం నాయనా"

"తమరు ఇలా జనశూన్యమైన అరణ్యాల్లో నివసించటం ఎవరికి లాభం స్వామీ. పట్టణానికి వచ్చి ప్రజలకు తమ ఆశీస్సులు అందచేయకూడదా స్వామీ"

స్వాముల వారుకళ్లు మూసుకుని, తెరిచి "అదే మంచిదిలా వుంది నాయనా! ఈ నాటితో నా తపస్సు ముగిసింది. చూద్దాం. అయినా నాలాంటి సన్యాసికి ఆదరణ ఎక్కడ లభిస్తుంది నాయనా" అన్నారు అరమోడ్పు కన్నులతోనే.

ఆ మాటకి తలకొట్టేసి నట్టయింది పరంధామంకు.

"అలా అనకండి స్వామీ. నేనువున్నాను. నా వెనక ఎంతో మంది ధనిక భక్తులున్నారు. పెద్ద వుద్యోగులున్నారు. మేమంతా కలిసి తమకోఆశ్రమం కట్టిస్తాం." అని ప్రకటించేడు.

"అంతకంటేనా నాయనా" అన్నారు స్వాములవారు అభయ ముద్రని అభినయిస్తూ.

* * *

ఊరి చివర ప్రశాంత వాతావరణంలో ఓఆశ్రమం వెలిసింది. అక్కడ క్షయ ఆస్పత్రి కట్టాలనే ప్రతిపాదన వుండేది. కాని ఉన్నతోద్యోగుల భక్తికి చిహ్నంగా అక్కడ ఆశ్రమం మాత్రమే ఏర్పడింది.

ఆ ఆశ్రమం భక్తులతో నిరంతరం కలకలలాడుతూ వుంటుంది. పరంధామం గారి ప్రియురాలు పారిజాతం రేయింబవళ్ళు స్వామి సేవ చేసి తరిస్తోంది. పారిజాతాన్ని స్వాముల వారి సన్నిధికి చేర్చి వెంకటేశ్వర స్వామికి నిలువు దోపిడీ ఇచ్చినంత సంబర పడిపోతున్నాడు పరంధామం.

పారిజాతం మాటంటే స్వామికి వేదవాక్కు. అంచేత భక్తులకు స్వామివారికంటే పారిజాతం అంటేనే భక్తి మిక్కుటం.

నిరంతరం ఆశ్రమంలోకి ప్రవహించే కానుకలతోటీ, డిబ్బీలు నిండిపోతున్న డబ్బుతోటీ, రోజురోజుకీ పెరిగిపోతున్న స్త్రీ పురుష భక్తకోటితోటీ స్వామీజీ చాలా ప్రశాంతంగా, ప్రసన్నంగా జీవితాన్ని నెట్టేస్తున్నారు.

కాని ఒక్క విషయం మాత్రం ఆయనకి ఇప్పటికీ అర్థం కాలేదు. అర్థం అయినట్లు అనిపించినప్పుడు మాత్రం –

"ఇంత సుళువైన మార్గం వుండగా ఇంత కాలంనుంచీ ఆ ముళ్లదారిలో ఎందుకు పరుగెత్తేను" అని ఆత్మ విమర్శ చేసుకుంటూ వుంటారు స్వాముల వారు.

*(ప్రజాతంత్ర, 20 నవంబరు 1977)*